క్లుప్తంగా

న్యాయవాదుల విధుల బహిష్కరణ



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కాకినాడ లీగల్: రాజమహేంద్రవరంలో న్యాయవాది దుగ్గిరాల సుభాష్‌పై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తూ కాకినాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు నరహరిశెట్టి రవికృష్ణ మాట్లాడుతూ, న్యాయవాది సుభాష్ ఇంటికి వెళ్తున్న సమయంలో పోలీసులు దౌర్జన్యంగా దాడి చేసి, కేసు నమోదు చేశారన్నారు. న్యాయవాదుల రక్షణకు చట్టం తేవాలని, వారిపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సామరస్యంగా ప్రార్థనలు జరుపుకోవాలి

కాకినాడ సిటీ: జగన్నాథపురం సెంటినరీ, ఆంధ్ర బాప్టిస్ట్ చర్చిలో కొంతకాలంగా ప్రార్థనల నిర్వహణపై వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో చర్చి ప్రతినిధులతో ఆర్డీఓ బీవీ రమణ మంగళవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. శాంతి, ప్రేమ, సుహృద్భావ వాతావరణంలో చర్చిలో ప్రార్థనలు నిర్వహించుకోవాలని సూచించారు. ఎటువంటి ఆంక్షలూ లేకుండా చర్చి నియమావళి ప్రకారం ప్రార్థనలు జరుపుకోవాలన్నారు. ఇప్పటికే ఈ చర్చి తగాదాపై 107 సీఆర్‌పీసీ ఉత్తర్వులున్నాయని, ఈ నేపథ్యంలో ప్రార్థనా సమయం వేళలు పాటించి, నియమావళి ప్రకారం నడుచుకోవాలని ఆర్డీఓ సూచించారు. సమావేశంలో చర్చి ప్రతినిధులు, వన్‌టౌన్ సీఐ కృష్ణ, తహసీల్దార్ పి.సీతాపతిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దీపక్ పాల్గొన్నారు.

మోదకొండలశర్మకు ఘనంగా సత్కారం



శర్మకు పురస్కారాలు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఆర్టీసీ కాలనీకి చెందిన సీనియర్ అర్చకుడు వేమకోటి మోదకొండలశర్మను హైదరాబాద్‌కు చెందిన విశ్వజ్యోతి జ్యోతిష విజ్ఞాన సంస్థ పలు పురస్కారాలతో సత్కరించింది. విజయవాడలో ఆదివారం నిర్వహించిన వైదిక జ్యోతిష సమ్మేళనంలో భాగంగా పలువురు పండితులను ఉగాది పురస్కారాలతో సత్కరించారు. ఇందులో భాగంగా మోదకొండలశర్మను జ్యోతిషరత్న, వాస్తురత్న, అర్చకరత్న వంటి బిరుదులతో సత్కరించారు.

రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘ భవనంలో ఆధార్ పాయింట్



ఆధార్ నమోదు చేస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ భవనంలో మంగళవారం ఆధార్ పాయింట్‌ను ప్రారంభించామని అధ్యక్షుడు కె.పద్మనాభం తెలిపారు. సీనియర్ విశ్రాంత ఉద్యోగులు ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ఇక్కడ వీలు కలుగుతుందన్నారు. చాలామంది విశ్రాంత ఉద్యోగులు ఆధార్ మార్పులు చేసుకుంటున్నారని, ఇంటి నుంచి కదల్లేని పరిస్థితుల్లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల ఇళ్లకు కూడా సిబ్బందిని పంపించి, వారి ఆధార్ వివరాల నమోదుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి పీఎస్ఎస్ఎన్‌వీ శాస్త్రి, కోశాధికారి ఎస్.ఇబ్రహీం, ఆధార్ కేంద్రం సిబ్బంది జి.శశిధర్, ఎన్ఎస్ శ్రీనివాస వర్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారం

కరప: గ్రామంలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి మంగళవారం ×ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాలు నిర్వహించారు. కరపత్రాలు పంచారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఛాత్రాలయ పురస్కారం

బాలాజీచెరువు: శ్రీనగర్ ఆదిత్య పాఠశాలకు సుచిర్ ఇండియా ఫౌండేషన్ బెస్ట్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ అవార్డుగా ఛాత్రాలయ పురస్కారం ప్రకటించింది. సీవీ రామన్ సైన్స్ టాలెంట్ టెస్టులో రాష్ట్ర స్థాయిలో రెండు, సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డులు జిల్లా స్థాయిలో ఏడు సాధించారు. ఈ సందర్భంగా ఈ నెల 16న హైదరాబాద్ రవీంద్రభారతిలో పాఠశాల డైరెక్టర్ శృతిరెడ్డికి ఛాత్రాలయ పురస్కారం అందజేస్తున్నామని ఫౌండేషన్ చైర్మన్ వై.కిరోన్ తెలిపారు.

నైపుణ్యాభివృద్ధిరస్తు

- నియోజకవర్గాల్లో స్కిల్‌హబ్‌ల ఏర్పాటు
- కాకినాడ సిటీకి జీపీటీ.. రూరల్‌కు ప్రభుత్వ ఐటీఐలో కేంద్రాలు
- ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యాన శిక్షణ కార్యక్రమాలు



ప్రభుత్వ ఐటీఐలో రూరల్ నియోజకవర్గ స్కిల్‌హబ్ ప్రారంభించిన ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు (ఫైల్)

బాలాజీచెరువు: యువతలో నైపుణ్యాలకు మరింత పదును పెట్టడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా అందిపుచ్చుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యాన స్కిల్‌హబ్‌లకు శ్రీకారం చుట్టగా.. వాటిని నియోజకవర్గాల వారీగా ఇప్పటికే ఏర్పాటు చేశారు. కాకినాడ సిటీ నియోజకవర్గానికి సంబంధించి గర్ల్స్ పాలిటెక్నిక్ కళాశాలలోను, రూరల్‌కు ప్రభుత్వ ఐటీఐలోను ఈ స్కిల్‌హబ్‌లు ఏర్పాటయ్యాయి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ వివిధ కోర్సులలో నిరుద్యోగులకు శిక్షణ ఇస్తోంది. ఒక్కో స్కిల్‌హబ్‌కు గతంలో రూ.15 లక్షల విలువైన టెలివిజన్లు, సీసీ కెమెరాలు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఈ స్కిల్‌హబ్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో ఎంఎస్ ఆఫీస్–ఎక్స్86, జావా, పైథాన్ బేసిక్స్, పైథాన్ ఫర్ డేటాసైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, క్లౌడ్ ఆర్కిటెక్ట్, డిజిటల్ మార్కెటింగ్, సైబర్ సెక్యూరిటీ, జావా, టాలీ విత్ జీఎస్టీ, ఆండ్రాయిడ్ వంటి కోర్సులలో దాదాపు 2 వేల మందికి శిక్షణ ఇచ్చారు. 15 నుంచి 45 రోజుల పాటు శిక్షణ అనంతరం వీరికి పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు కూడా అందజేశారు. కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో హిటాచీ వంటి కంపెనీలు విద్యార్థులకు షార్ట్‌టర్మ్ కోర్సులు నిర్వహించి, ఆసక్తి ఉన్న వారికి ఉద్యోగాలు కూడా ఇచ్చాయి.

ప్రస్తుత కోర్సులు ఇవే..

మహిళా పాలిటెక్నిక్‌లో: డొమెస్టిక్ వాయిస్, వెహికల్ మెకానిక్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎయిర్ కండిషనర్ ఫీల్డ్ టెక్నీషియన్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్.

ప్రభుత్వ ఐటీఐలో: జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, సెల్ఫ్ ఎంప్లాయీ టైలరింగ్.

సద్వినియోగం చేసుకోవాలి



పదో తరగతి నుంచి పీజీ వరకూ చదివిన విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించాలన్న ఆశయంతో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ పని చేస్తుంది. నిరుద్యోగ యువతీ యువకులకు, మహిళలకు ఆసక్తి ఉన్న కోర్సులలో శిక్షణ ఇస్తున్నాం. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, చదువుకున్న యువతకు ఉపాధి కల్పించాలని నిశ్చయించారు. డిమాండ్ ఉన్న కోర్సులలో నైపుణ్యం పెంచి, వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

– డి.హరిశేషు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి, కాకినాడ

కలెక్టర్, జేసీలకు అభినందనలు



కలెక్టర్ కృతికా శుక్లాకు అభినందనలు తెలుపుతున్న ఏపీ ఎన్జీఓ సంఘం ప్రతినిధులు

కాకినాడ సిటీ: జిల్లా ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఏపీఎన్జీఓ సంఘం జిల్లా, రాష్ట్ర ప్రతినిధులు కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియలను మంగళవారం కలసి అభినందనలు తెలిపారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ, ప్రజలు, ఉద్యోగులు సమస్యలు పరిష్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లాకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జి.రామ్మోహనరావు, పేపకాయల వెంకటకృష్ణ, పసుపులేటి శ్రీనివాస్, మట్టపర్తి వెంకటేశ్వరరావు, సరెళ్ల చంద్రరావు, పాలపర్తి మూర్తిబాబు, కేవీఎస్‌వీ ప్రసాద్, జిల్లా జేఏసీ అమరావతి చైర్మన్ పితాని త్రినాథరావు, ఎన్‌వీఎస్ఆర్‌కే దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి



సంకురాత్రి చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న వెంకటేశ్వరరావు

బోట్‌క్లబ్: సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు యువత ముందుకు రావాలని సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పద్మశ్రీ పురస్కార గ్రహీత సంకురాత్రి చంద్రశేఖర్ అన్నారు. రోటరీ బ్లడ్‌బ్యాంక్, వలంటరీ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యాన స్థానిక ఎల్‌బీ నగర్‌లో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదాన శిబిరాల వల్ల సమాజానికి ఎంతో మేలు చేకూరుతుందని, దీనిపై నేటికీ అపోహలు ఉండటం దురదృష్టకరమని అన్నారు. ఇటువంటి శిబిరాల్లో యువత అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేస్తే ఆరోగ్యపరంగా వారికి మేలు జరుగుతుందని, దీంతో పాటు సమాజానికి ప్రాణదానం చేసినవారవుతారని అన్నారు. కాకినాడ వలంటరీ బ్లడ్ డోనర్స్ క్లబ్ చైర్మన్ జ్యోతుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, వంద వరకూ స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించాలనే లక్ష్యంతో ఉన్నానని చెప్పారు. ప్రతి వారం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు సకాలంలో రక్తం అందించడానికి నిరంతరం ఈ శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. శిబిరంలో వంద మందికి పైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సంకురాత్రి చంద్రశేఖర్‌ను వెంకటేశ్వరరావు సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో రోటరీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ టీవీ బాలకృష్ణ, కాకినాడ సీపోర్టు అధికారి మురళీధర్, రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ కార్యదర్శి వడ్డాది ఆదిత్య, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ బోడిశెట్టి పద్దరాజు పాల్గొన్నారు.

ఏపీ డ్వాక్రా విజయాలకు దేశ విదేశాల్లో గుర్తింపు



సీఎం జగన్ కటౌట్‌కు క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ గీత. చిత్రంలో ఎమ్మెల్యే ద్వారంపూడి, కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, పార్టీ నగర అధ్యక్షురాలు శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థిని పద్మశ్రీ తదితరులు



వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి హాజరైన డ్వాక్రా మహిళలు

- ఎంపీ వంగా గీత
- ఘనంగా వైఎస్సార్ ఆసరా సంబరాలు
- పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి, నేతలు

కాకినాడ: రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలు సాధించిన ఆర్థిక స్వావలంబన, విజయాలు, ప్రగతి దేశ విదేశాల్లో ఎంతో గుర్తింపు పొందాయని ఎంపీ వంగా గీత అన్నారు. ఇందుకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కారణమని చెప్పారు. స్థానిక గాంధీనగర్ పార్కు సమీపాన వైఎస్సార్ ఆసరా సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కౌడా) చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ, ప్రతి మహిళా ఆర్థికంగా బలోపేతమైనప్పుడే సమాజం అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. డ్వాక్రా సంఘాల పరపతిని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు దిగజారిస్తే, అగ్రస్థానంలో నిలిపిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని చెప్పారు.

కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ, ఇచ్చిన మాటకు కట్టుబడి నాలుగు విడతల్లో డ్వాక్రా రుణాలు రద్దు చేస్తామన్న సీఎం జగన్ ఇప్పటి వరకూ ఒక్క కాకినాడలోనే రూ.75 కోట్ల మేర లబ్ధి చేకూర్చారని తెలిపారు. ఆసరా పథకమే కాకుండా నగరంలోని 33 వేల మంది మహిళల పేరిట ఇళ్ల పట్టాలు, ఇతర ప్రభుత్వ పథకాలు కూడా వర్తింపజేశారని గుర్తు చేశారు. ఇటువంటి ముఖ్యమంత్రిని మరోసారి ఆశీర్వదించాలని ద్వారంపూడి కోరారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి కుమార్ మాట్లాడుతూ, ప్రతి మహిళా లక్షాధికారి కావాలని వైఎస్సార్ ఆశిస్తే.. ఆయన తనయుడు సీఎం జగన్ అమలు చేసి చూపిస్తున్నారని అన్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న మాట్లాడుతూ, దేశ చరిత్రలోనే మాట తప్పని మడమ తిప్పని నేతగా ముఖ్యమంత్రి ప్రతి హామీ అమలు చేసి చూపిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ఆసరా నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్‌కు డ్వాక్రా మహిళల సమక్షంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, మీసాల ఉదయ్‌కుమార్, శిష్టికరణాల కార్పొరేషన్ డైరెక్టర్ దండుమహంతి లక్ష్మణరావు, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు, మెప్మా సీఎంఎం వెంకటరాజు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అల్లా దీవెనలతో మరింత అభివృద్ధి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి, ముస్లిం పెద్దలు

కాకినాడ: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి తన తోడ్పాటు ఎప్పుడూ ఉంటుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. రంజాన్ సందర్భంగా స్థానిక అక్బర్ మసీదు ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, అల్లా దీవెనలతో ముస్లిం మైనార్టీలకు మరింత మంచి జరగాలని ఆకాంక్షించారు. రూ.1.40 కోట్లతో షాదీఖానా నిర్మాణంతో పాటు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సుమారు రెండు దశాబ్దాల చరిత్రలో రెండు కొత్త మసీదులను నిర్మించుకోగలిగామన్నారు. రాజకీయంగా తనకు ఆది నుంచీ అండగా ఉన్న ముస్లిం మైనార్టీలకు రుణపడి ఉంటానని ద్వారంపూడి చెప్పారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ బాబులు, కార్యదర్శి టిప్పు సుల్తాన్, ఉపాధ్యక్షుడు షేక్ మౌలాలీ, కోశాధికారి షేక్ అబ్దుల్, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు రెహ్మాన్ ఖాన్, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్లు జాఫర్‌ఖాన్, కరీముల్లా, చోటు, వైఎస్సార్ సీపీ నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాలీద్‌బిన్ వలీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బాలాత్రిపుర సుందరి అమ్మవారి తెప్పోత్సవం



కన్నుల పండువగా సాగుతున్న తెప్పోత్సవం

బోట్‌క్లబ్: వసంత నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. ప్రధానార్చకుడు చెరుకూరి రాజా ఆధ్వర్యాన స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన చిన్న పడవలో విగ్రహాలను ఉంచి కోనేరులో మూడుసార్లు ఊరేగించారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్పులు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కౌడా) చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి చినబాబు, ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పండగలా పింఛన్ల పంపిణీ



ఇంద్రపాలెంలో వృద్ధురాలికి పింఛన్ పంపిణీ



నడకుదురులో మంచానికే పరిమితమైన సత్తెమ్మకు పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ వై.అనిల్‌కుమార్

కాకినాడ రూరల్: వైఎస్సార్ పింఛన్ కానుక పథకం కింద సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ గ్రామాల్లో పండగలా జరుగుతోంది. ఏప్రిల్ నెలలో మొదటి రెండు రోజులూ బ్యాంకులకు సెలవు కావడంతో సోమవారం పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. గ్రామాల్లోని సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారు. కాకినాడ రూరల్ మండలంలో వలంటీర్లతో పాటు వైఎస్సార్ సీపీ కన్వీనర్లు, గృహసారథులు కూడా పింఛన్ల పంపిణీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం లబ్ధిదారులు 17,584 మందికి గాను మంగళవారం సాయంత్రానికి 13 వేల మందికి పంపిణీ చేశారు. రాత్రి 8 గంటలకు పూర్తి స్థాయిలో పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తామని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు.

కరపలో 74 శాతం పంపిణీ

కరప: మండలంలోని 23 గ్రామాల్లో 11,359 మంది లబ్ధిదారులకు వివిధ రకాల పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా మంగళవారం 8,428 మందికి (74.20 శాతం) పంపిణీ చేశామని ఎంపీడీఓ కర్రె స్వప్న తెలిపారు. అన్ని రకాల పింఛన్లూ కలిపి రూ.3,09,95,250 బట్వాడా చేయాల్సి ఉండగా రూ.2,29,57,500 అందజేశామని చెప్పారు. గ్రామాల్లో కొంతమంది లబ్ధిదారులు లేకపోవడం, సిగ్నల్స్ లేక సర్వర్ నెమ్మదిగా పని చేయడం, అనారోగ్యం వంటి వాటితో మరి కొంత మంది అందుబాటులో లేకపోవడం తదితర కారణాలతో నూరు శాతం పంపిణీ జరగలేదని వివరించారు. బుధ, గురు వారాల్లో నూరు శాతం పంపిణీ పూర్తి చేస్తామని ఆమె చెప్పారు. ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శులు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. ఉప్పలంక గ్రామ సచివాలయంలో 93.95 శాతం, వేములవాడ 85.73, కూరాడ 82.62 శాతంతో పింఛన్ల పంపిణీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. మండలంలో ఉదయం 5 గంటలకే పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. ఠంచన్‌గా పింఛన్లు పంపిణీ చేయడంపై లబ్ధిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. తెల్లవారక ముందే వలంటీర్లు తలుపు తట్టి పింఛన్ సొమ్ములు చేతిలో పెట్టారని, ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలవేనని వృద్ధులు, మహిళలు సంతోషం వ్యక్తం చేశారు.

రైలు చార్జీల్లో వృద్ధులకు రాయితీ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణరాజు

కాకినాడ రూరల్: కేంద్ర ప్రభుత్వం సానుభూతితో స్పందించి వృద్ధులకు కరోనా సమయంలో రద్దు చేసిన రైలు ప్రయాణ రాయితీలను పునరుద్ధరించాలని సీనియర్ సిటిజన్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్దరాజు సత్యనారాయణరాజు విజ్ఞప్తి చేశారు. బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యాన సర్పవరం జంక్షన్‌లో మంగళవారం నిర్వహించిన సీనియర్ సిటిజన్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధుల్లో 95 శాతం పేదలే ఉన్నారన్నారు. వివిధ అనారోగ్యాలతో పట్టణాలు, నగరాల్లో లభించే వైద్య చికిత్స కోసం రైల్వే రాయితీలు ఎంతో ఉపయుక్తంగా ఉండేవని చెప్పారు. వెంటనే వీటిని పునరుద్ధరించాలని కోరారు.

కొత్త జిల్లా ఏర్పాటుతో ఉద్యోగులకు ఎంతో మేలు



దేవదాయ శాఖ ఉద్యోగులకు కేక్ తినిపిస్తున్న డీసీ విజయరాజు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): దేవదాయ శాఖ ఉద్యోగులకు కాకినాడ జిల్లా ఏర్పాటుతో ఎంతో మేలు జరిగిందని డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు అన్నారు. జిల్లా దేవదాయ శాఖ కార్యాలయం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం సంబరాలు నిర్వహించారు. విజయరాజు కేక్ కట్ చేసి ఉద్యోగులందరికీ తినిపించారు. ఉమ్మడి తూర్పు గోదావరిగా ఉన్నప్పుడు జిల్లా దేవదాయ శాఖ కార్యాలయం రాజమహేంద్రవరంలో ఉండటంతో ఉద్యోగులు వ్యయప్రయాసలు పడాల్సి వచ్చేదన్నారు. జిల్లా దేవదాయ శాఖాధికారి పులి నారాయణమూర్తిని సత్కరించారు.

ఘనంగా మహావీర్ జయంతి

కాకినాడ రూరల్: శ్రీరామ నామ క్షేత్రం, ఆంధ్ర భద్రాద్రి ఆధ్వర్యాన సర్పవరం జంక్షన్‌లో మహావీర్ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహావీర్ చిత్రపటానికి గల్లా సుబ్బారావు, రెడ్నం రాజా, అడబాల రత్నప్రసాద్, ఎస్.శ్రీనగేష్, ఓదూరి వరలక్ష్మి, పి.పార్థసారథి, అడబాల సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీరామ నామ క్షేత్ర అధ్యక్షుడు రాజా, గురుస్వామి గలాల సుబ్బారావు మాట్లాడుతూ, అహింసా మార్గాన్ని బోధించిన మహావీర్ చిన్న వయసులోనే ప్రపంచ వ్యాప్తంగా అహింసా వాదాన్ని, సత్యం, ప్రేమతత్వాన్ని బోధించారని అన్నారు. రాజ కుటుంబంలో జన్మించి, సత్యాన్వేషణ కోసం తన 30వ ఏటనే రాజ సింహాసనాన్ని, కుటుంబాన్ని విడిచారని చెప్పారు. 36వ ఏట సన్యాసం స్వీకరించి, 43వ ఏట జ్ఞానోదయం పొందారన్నారు. 32 సంవత్సరాల పాటు అహింస, ధర్మంపై ప్రచారం చేసిన మహావీరుడు జైనులకు ఆరాధ్య దైవమని అన్నారు.

కాంగ్రెస్‌కు 'నులుకుర్తి' రాజీనామా



నులుకుర్తి వెంకటేశ్వరరావు

కాకినాడ: పీసీసీ ప్రధాన కార్యదర్శి నులుకుర్తి వెంకటేశ్వరరావు మంగళవారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుకు పంపించారు. ఈ సందర్భంగా స్థానిక కౌస్తుభ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నులుకుర్తి మాట్లాడారు. తాను కాంగ్రెస్ పార్టీలో పాతికేళ్ల పాటు సేవలందించానన్నారు. 1998లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సమక్షంలో పార్టీలో చేరి రెండుసార్లు జెడ్పీటీసీ సభ్యునిగా పని చేశానని చెప్పారు. 2009, 2019 ఎన్నికల్లో కాకినాడ రూరల్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కూడా దక్కిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం కాంగ్రెస్ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నప్పటికీ తాను మాత్రం పార్టీ వెన్నంటి ఉండి సేవలు అందించానన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కొనసాగలేని పరిస్థితి ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. ఏ పార్టీలో చేరేది త్వరలోనే నిర్ణయించుకుంటానని నులుకుర్తి అన్నారు.